**స్రవంతి నెం: 8లో ఇచ్చినవాక్యం**

"ఇంకో పావుగంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయించండి."చెప్పాడు సుబ్బారావు పౌడర్ అద్దుకుంటూ.

**ఆధారంగా రాసిన కథలు**

"నిజాయితీగా, ఈ ఉద్యోగంచేస్తూ ఆరుగురు ఆడపిల్లలకీ, ఓ అబ్బాయికీ తండ్రినవటం తప్ప, ఆర్థికంగా ఏమీ సాధించలేకపోయాను. పెద్దబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. నలుగురమ్మాయిలు పెళ్ళికెదిగున్నారు. నేనింకో వారం రోజుల్లో రిటైరవబోతున్నాను."

"సార్...డ్యూటీలో ఉండగా చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తుంది గదా మన డిపార్ట్మెంట్...నేను ఈ రోజు నాటకం వేయటాన్ని డ్యూటీలో ఉన్నట్లుగానే పరిగణిస్తారు. నేను సర్వీసులోనే చనిపోతే...మీరు నా డెత్ సర్టిఫికెట్ తీసుకుని మా అబ్బాయికి ఉద్యోగం వేయించాలి. నా మరణాంతరం వచ్చే డబ్బు, కనీసం ఒకమ్మాయి పెళ్ళయినా చెయ్యగలిగితే కాస్త తృప్తి నాకు. నాకీ సహాయం చేసి, మీరు నా కుటుంబాన్ని ఆదుకోవాలి సార్. నాటకంలో లాగే ఇంకో పదిహేను నిముషాల్లో జీవితంలో కూడా నా పాత్ర ముగిసిపోతుంది. అలాగని ఈ నాటకానికి అన్యాయం చెయ్యను. తప్పకుండా మన నాటకానికి ప్రథమ బహుమతి వచ్చేలా కృషి చేస్తాను...ఇంతటి బరువు మీపై మోపుతున్నందుకు నన్ను క్షమించండి" కళ్ళలో నీళ్ళు ధారగా జారిపోతుండగా, యస్.ఐ. శ్రీనివాస్ పాదాలని కళ్ళకద్దుకున్నాడు సుబ్బారావు-అతని చేతిలో ఓ కవర్ ఉంచి.

శ్రీనివాస్‌కి మాట పెగల్లేదు. నాటకంలో డైలాగుల్లా, విషయమంతా "గడగడా" చెప్పేసి, అతని మెదడుని మొద్దుబారేలా చేశాడు సుబ్బారావు.

"ఇంకో పావుగంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయించండి" చెప్పాడు సుబ్బారావు పౌడర్ అద్దుకుంటూ. అప్పటికి అతను "విషం" తాగి ఉన్నట్లు మాత్రం చెప్పలేదు.

సుబ్బారావు శరీరంపై పడి, మౌనంగా రోదిస్తున్న, 'యస్.ఐ' శ్రీనివాస్‌కి ఈ మాటలింకా చెవుల్లో గింగురుమంటున్నాయి.

—పవన్
(కడప)

# వే..చ..పె..చూ..సి..చే

"ఇంకో అరగంటలో పెళ్లి వారు వస్తున్నారు వాడ్ని చూసుకోవడానికి. ఆ వెధవ బయటికి వెళ్తే కాళ్లు విరగ్గొడ్తానని చెప్పు"-విసురుగా వచ్చి చెప్పాడు గోవిందయ్య భార్య సరస్వతితో కొడుకు సుబ్బారావుకి కూడా వినబడేటట్లు-

"ఇంకో పావు గంటలో నేను చచ్చిపోగానే అవి సిద్ధం చేయండి" చెప్పాడు సుబ్బారావు పౌడరు అద్దుకుంటూ-

సుడిగాలిలా వెళ్లిపోతూ ఆ మాటవిని ఠక్కున ఆగిపోయాడు గోవిందయ్య.

"ఒరేయ్ నాయనా! ఏవిట్రా ఆ మాటలు...

"కన్నీళ్ళతో" అంది తల్లి.

"ఛావనీలే వెధవని, చావంటే ఏదో చేగోడి తినడం అనుకుంటున్నాడు కంమూచుంవె! ఛావనీ" మహా కోపంగా చెప్పాడు గోవిందయ్య.

"ఇదిగో...ఇదిగో...అలాంటి అర్థం పర్థంలేని తిట్లూ, ఆడపెళ్లి వారు పెళ్లిచూపులకి రావడం మొదలైనవి భరించలేకే నేను ఛస్తానంటున్నాను-కంమూచూంవె అంటే ఏమిటో, నలభై ఏళ్ళయి కాపురం చేస్తున్నావు...కనీసం నీకైనా తెలుసా అమ్మా...?" అసహనంగా అడిగాడు సుబ్బారావు.

"నాకేమిటి తెలుసు నాయనా-నా పెళ్లి నాటి నుంచీ యీ రకం మాటలు వింటున్నాను. పెళ్లి నాడు మా నాన్ననీ యిలాగే అన్నారు. పిసకాకయి అని"

"అంటే?"

"పిల్లను యివ్వగానే సరికాదు కట్నం యివ్వాలి-అనిట-కొంచెం సేపు పోతే ఆయన చెప్తారులే"...అంది తల్లి నిరాసక్తంగా-

"కంమూచుంవె అంటే అర్థం చేసుకోవడం బందరు లడ్డూ తినడం అనుకొన్నావు పూరా పంకొమువె...." అని ఓ క్షణం ఆగి "దీనిక్కూడా అర్థం చెప్పాలి కాబోలు...కంమూచుంవె అంటే పంది కొక్కు ముక్కు వెధవా అనీ-అర్థం అయ్యిందా...ఇంతకీ నువ్వు పెళ్లిచూపులకి సిద్ధంగా ఉన్నావా లేదా? లేకపోతే..."

"నాన్నా...అమ్మా, నేనూ ఎలాగూ ఈ తిట్ల బాధ పడుతున్నాం, ఇంకో అమాయక ప్రాణిని కూడా తీసుకువచ్చిబలి చేయలేను నాన్నా అందుకే అంటున్నా...నేచపెచూసిచే..."

"అంటే ఏమిటో అఘోరించు..."

"అంటే నేను చచ్చేక పెళ్ళి చూపులు సిద్ధం చేయించండి" -అన్నాడు సుబ్బారావు—

"ఓకే,కట్" అన్నారు దర్శకులు జంధ్యాల. హాస్య భరితమైన ఈ సన్నివేశం కుషీకిరణ్ మూవీస్ వారి "అమ్మాయి గారి అబ్బాయి" చిత్రంలోనిది. ఇందులో గోవిందయ్య వీరభద్రరావు, సుబ్బారావుగా వేలు, సరస్వతిగా కాకినాడ శ్యామల నటిస్తున్నారు ప్రముఖ రచయిత మల్లాదివసల "ఒక ఆమె-ఒక అతడు" ఆధారంగా తీసిన ఈ చిత్రంలో ఇంకా చంద్రమోహన్, సాక్షిరంగారావు, రాళ్ళపల్లి, రావికొండలరావు, పొట్టిప్రసాద్, నిర్మల, రమాప్రభ, శ్రీలక్ష్మి ప్రధాన తారాగణం. ఈ చిత్రం ద్వారా వినిత అనే నూతన నటిని తెలుగు తెరకి పరిచయం చేస్తున్నారు వేటూరి, రమేష్ నాయుడు, గౌతంరాజు, తోటతరణి, కాంభోజరావు, జంధ్యాల తెర వెనుక ప్రముఖులు. ఆంధ్రాలో స్రవంతి ద్వారా జనవరిలో విడుదల కాబోతోంది ఈ చిత్రం.

-సుధాలహరి
(విజయనగరం)

## ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది..

"గృహప్రవేశమయిన రెండేళ్ళకుకానీ ఇల్లుకట్టలేనండీ!" అన్నాడు వినయమూర్తి వినయంగా మామగారితో